# వడ్డించేవాడు మనవాడైతే....

"చాలా సాడ్ న్యూస్‌రా, సూరీ" డ్యూటీ కోసం బస్సు దిగిన వెంటనే ఫ్యాక్టరీ గేటు దగ్గర కనబడిన రవి అన్నాడు. "గోపాలానికి ప్రమోషన్ యిచ్చేశారు, రా!"

కాళ్ళ క్రింద భూమి బ్రద్దలైనట్లు తోచింది నాకు, ఆగిపోయాను.

"గోపాల్ మనకన్నా మూడేళ్ళ జూనియర్ రా" మళ్ళీ అన్నాడు రవి. ఎంత ప్రైవేటు రంగ సంస్థ అయితే మాత్రం......" అతను ఒక సిగరెట్టు వెలిగించాడు... వాడికి ప్రమోషన్ యివ్వడమేమిటిరా? ఏ పనీ సమంగా చేయడు, ఆ మాటకొస్తే డ్యూటికే సమంగా రాడు." రవి గట్టిగా పొగ పీల్చి వదిలాడు.

నిజమే! గోపాల్ ఎన్నడూ సక్రమంగా డ్యూటీకి రాడు. వారానికి ఒకరోజో, రెండు రోజులో కనిపిస్తూ వుంటాడు. సక్రమముగా డ్యూటీకి రాకపోతే ఉద్యోగము నుంచి తీసి వెయ్యవలసి వస్తుందని, మా శాఖాధికారి హెచ్చరించి వున్నాడు కూడా అయినా గోపాల్ అదేమీ పట్టించుకునేవాడు కాదు. అతనికి ఊరిలో ఏవేవో వ్యాపారాలు వున్నాయట! అక్కడ ఏ పనీ లేనప్పుడు డ్యూటీకి వస్తాడట!

"ఏమి- అలా బెల్లం కొట్టిన రాయిలా నిలబడిపోయావు?" రవి అన్నాడు "ఈ మౌనమే కొంపముంచుతోంది ఏమీ చెయ్యకపోయినా ఇది చేసాను, అది చేసాను అని చెప్పుకోవాలిరా. నోరు మూసుకొని కూర్చుంటే లాభంలేదు. చేతల కన్నా మాటలు ముఖ్యం" అతను బస్సువైపు నడిచాడు.

చల్లగాలి తగిలితే వర్షించటానికి సిద్ధముగా వుంది పైన నల్లమబ్బుతో నిండిన అకాశము. పుట్టెడు మంటను పొట్టలో పెట్టుకొని ఆవిరితో నిట్టూరుస్తోంది, ఎదురుగా మా కర్మాగారము.

గేటు దాటాను. డ్యూటీ దిగి వచ్చే సహెూద్యోగులు నన్ను దాటుకొని వెళ్ళారు. కొందరు నన్ను పలకరించే ప్రయత్నము చేసారు. మరి కొందరు నన్ను చూసి వారిలో వారు గుసగుసలాడుకున్నారు. నేను తల ఎత్తలేదు. గబగబా నా సెక్షన్‌వైపు

నడిచాను. ప్రమోషన్ యివ్వని మా శాఖాధికారిని పచ్చిగా కొరికి మింగేయాలని అనిపించింది నాకు.

"డ్యూటీకి రాగానే మీరు వస్తారని నాకు తెలుసు." కేబిన్ తలుపు తెరవగానే మా బాస్ అన్నాడు, "రండి, కూర్చోండి"

పళ్ళు కొరుకున్నాను నేను.

"నేను చాలా చింతిస్తున్నాను, సూరీ" చూస్తున్న ఫైలు మూస్తూ అన్నాడు అతను. "ఇలా జరుగుతుందని అనుకోలేదు"

నేను ఏమీ అనలేదు.

వంకరటింకరగా వున్న గోడలని కప్పిపుచ్చటానికోసం వాటిమీద అతికించిన నగిషీ చెక్కిన చెక్కముక్కలు నన్ను చూసి వెటకారంగా నవ్వినట్టు అనిపించింది.

"మీరు బాగా పనిచేస్తారని నాకు తెలుసు. పైగా సీనియర్ కూడానూ..." "సమాధి పై పూలు వెయ్యటం ఎందుకండీ" కోపాన్ని ఆపుకోలేకపోయాను నేను. "బ్రతుకుతున్నప్పుడు మొహంమీద ఉమ్మకుండా వుంటే చాలు. ఎలాగయితేనేమీ తల ఎత్తి తిరగలేకుండా చేసారుకదండీ"

"ఆవేశపడకండి నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించండి"

"బాగానే అర్థం చేసుకున్నాను లెండి. డ్యూటీకి రానివాడికి ప్రమోషనూ, పనిచేసే వాడికి...."

బయట 'బాయిలర్' సేఫ్టీ వాల్వుపోయింది. అంతవరకూ అదుపులో వున్న ఆవిరి పెద్ద శబ్ధముతో బయటకు వచ్చేసింది.

"నిజమే. గోపాల్ సమంగా డ్యూటీకి రాడు. అందుకే నేను అతనికి ప్రమోషన్ యిమ్మని చెప్పలేదు"

"మరి......" నేను ఆశ్చర్యంతో వుండిపోయాను.

"జి.ఎమ్. గారు యివ్వాలని అనుకున్నారు"

"మరి, మీరు అతని సంగతి చెప్పలేదా?"

"తెలీకపోతే కదా, చెప్పటానికి ఒకప్పుడు బాగా పనిచేసేవాడు కదా' అని అడిగారు"

"నిజమేనండీ  ఒకప్పుడు గోపాల్ కూడా బాగా సిన్సియరే"

"జి.ఎమ్.గారు కూడా అదే మాట అన్నారు. మొదట్లో అతని ప్రవర్తన చాలా బాగుండేదిట. ఏ ప్రమోషనూ యివ్వకపోవటం వల్లనే గోపాల్ యిలా తయారయ్యాడనీ, ప్రమోషనిస్తే మళ్ళీ సిన్సియర్‌గా పనిచేస్తాడనీ అన్నారు"

నాకు నోటమాట రాలేదు. యాజమాన్యపు  కత్తికి రెండువైపులా పదును అంటే యిదే కాబోలు!

"అయినప్పటికీ మీరు చేసినపనుల గురించీ, దానివల్ల కంపెనీకి వచ్చిన లాభాల గురించి జి.ఎమ్. గారికి విపులంగా చెప్పాను అతను చాలా సంతోషించారు." మా బాస్ ఒక నిముషం ఆగారు. ఆ తర్వాత మెల్లిగా అన్నారు. "మీరేమీ బాధపడకండీ. మొన్న మీరు సూచించిన కొత్త పథకం వల్ల కంపెనీకి, రోజుకి ఆరు లక్షలు లాభము కదా? ఆ వివరాలిస్తూ మీకూ ప్రమోషన్ యిమ్మని గట్టిగా వ్రాస్తానులెండి.

"మొదటి దానికి మొగుడులేదు కానీ, కడదానికి కళ్యాణం అన్నట్లుంది." నేను గట్టిగా అన్నాను. "ఇప్పటివరకూ చేసినందుకు లేదు కానీ".....

"మీరు శృతిమించుతున్నారు. సూరీ." అతను అన్నాడు. "బాధపడుతున్నారు కదానని నా పరిధిదాటి జరిగిన వివరాలను చెప్పాను అయినా మీకు సంచాయిషీ చెప్పుకోవలసిన అవసరం లేదు. మీరు ఇంక వెళ్ళవచ్చు"

కసిగా బయటకు వచ్చాను. చెయ్యగలిగింది ఏముంది.

సెలవు పెట్టి ఊరు వెళ్ళిపోయాను. నెలరోజులు తర్వాత డ్యూటీలో చేరిన నన్ను పలుకరించింది గోపాల్ పెళ్ళికార్డు.

వధువు ఎవరో కాదు మా జి.ఎమ్. గారి అమ్మాయే.

రాఘవీస్ కోకిల ఫిబ్రవరి **1996.**